క్లుప్తంగా

మార్కెట్ కమిటీ సభ్యులకు సన్మానం



టేకుమట్ల: ఇటీవల నూతనంగా ఎంపికైన చిట్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, డైరెక్టర్లు నల్లబెల్లి విజేందర్, కనుమరుగుల సంపత్‌లను మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం దేశీ(డిప్లమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్సివ్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్) కమిటీ అధ్యక్షుడు బొడ్డు సదానందం ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొడ్డు సదానందం, ఎలవేని రాజేందర్, కొడగాని మహేందర్, ఎంబాడి రాజేందర్, కొడగాని నవీన్, ఇండ్ల మధూకర్, అజయ్, పుప్పాల రాజు, వంగ నరేష్, అనిల్, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహాముత్తారం: మండలంలోని డొబ్బలపాడు మోడల్ పాఠశాలలో కెమిస్ట్రీ సబ్జెక్ట్ బోధించుటకు హవర్లీబేస్డ్ టీచర్ పోస్టుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ రాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లు దరఖాస్తు ఫారాన్ని జత పరిచి ఈ నెల 30లోపు పాఠశాలలో ఇవ్వాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 31న డెమో నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

నియామకం



చంద్రశేఖర్, అధ్యక్షుడు

కాటారం: మండల ఫెర్టిలైజర్, సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కవ్వాల చంద్రశేఖర్ నియమితులయ్యారు. దుకాణాల యజమానులు శనివారం మండల కేంద్రంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా అల్లాడి చంద్రమౌళి, కొత్త రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా జక్కుల అజయ్‌కుమార్, కార్యదర్శులుగా తోట కోటేశ్వర్, దోమ భాస్కర్, కోశాధికారిగా బచ్చు ప్రభాకర్, ప్రచార కార్యదర్శిగా నిడిగొండ చెన్నకేశవ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

పాఠశాలలో బోనాల వేడుకలు



భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని సన్‌వ్యాలీ హైస్కూల్‌లో బోనాల వేడుకలను శనివారం ముందస్తుగా నిర్వహించారు. సోమవారం బోనాల పండగ ఉన్న నేపథ్యంలో పాఠశాలలో విద్యార్థులను సాంప్రదాయ పద్ధతిలో తయారు చేసి అమ్మవారి ప్రతిమలకు పూలమాల వేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సురేష్, సతీష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా హేమ



చిట్యాల: మండల తహసీల్దార్‌గా నల్లబెల్లి హేమ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ ఎండీ.ఖాజామోహినుద్దీన్ కలెక్టరేట్‌కు బదిలీ కాగా పలిమెలలో పని చేసిన హేమను ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ హేమను స్థానిక కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ రాంచందర్, ఆర్ఐ రాజు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'దివ్యాంగులను కించపర్చడం సరికాదు'

కాటారం: దివ్యాంగుల ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారిని స్మితా సబర్వాల్‌పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన కుంభం రమేశ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటలో డిమాండ్ చేశారు. బాధ్యతయుతమైన హోదాలో ఉండి దివ్యాంగులను కించపర్చేలా ప్రవర్తించడం సరికాదన్నారు. వారిపై జాలి, దయ, కరుణ చూపించాల్సిన ఒక ఐఏఎస్ ఇలా కఠినంగా వ్యవహరించడం బాధాకరమని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో స్మితా సబర్వాల్ అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు అనేక ఆరోపణలు ఉన్నప్పటికీ దివ్యాంగులు ఏనాడు విమర్శించిన దాఖలాలు లేవని అన్నారు. రాజ్యాంగ, చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న స్మితా సబర్వాల్‌ను కేంద్రం తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు.

శిథిలావస్థలో జీపీ భవనాలు



పెచ్చులు పడుతున్న చిట్యాల జీపీ భవనం



శిథిలావస్థలో ఉన్న నైన్‌పాక జీపీ భవనం

● ఇబ్బంది పడుతున్న జీపీ సిబ్బంది

చిట్యాల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవనంతో పాటు మండలంలోని నైన్‌పాక గ్రామ పంచాయతీ భవనాన్ని నలభై సంవత్సరాల క్రితం నిర్మించారు. పాత భవనాలు కావడంతో శిథిలావస్థకు చేరుకుని వర్షాలకు కురుస్తున్నాయి. భవనాల్లో ఉన్న రికార్డులు, వివిధ పత్రాలు తడిసిపోయే ప్రమాదం ఉంది. అలాగే ఎప్పుడు కూలుతుందో అని గ్రామ పంచాయతీ సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారు. చిట్యాల జీపీ భవనం పెచ్చులుడుతూ ప్రమాదకర స్థితిలో ఉంది. అధికారులు, పాలకులు స్పందించి తమ గ్రామ పంచాయతీలకు నూతన భవనాలను నిర్మించాలని ఆయా గ్రామాలకు చెందిన గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

పునరావాస కేంద్రం సందర్శన



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎస్సై హరీశ్

వాజేడు: తమకు ఇంటి స్థలాలను ఇప్పించేలా చూడాలని వాజేడు పునరావాస కేంద్రంలోని నిర్వాసితులు ఎస్సై రుద్రారపు హరీశ్‌ను కోరారు. పునరావాస కేంద్రానికి శనివారం ఎస్సై సందర్శించారు. ప్రతీ సంవత్సరం గోదావరి వరదల సమయంలో పునరావాస కేంద్రాలకు తీసుకువచ్చి వరదలు తగ్గగానే పంపిస్తున్నారని అలా కాకుండా తమకు ఇంటి స్థలాలను ఇప్పించాలని ఎస్సైని నిర్వాసితులు కోరారు. ఇంటి స్థలాలు ఇస్తే తామే ఇళ్లు కట్టు కుంటామని వారు తెలిపారు. ఇంటి స్థలాలు ఇచ్చే బాధ్యత పోలీస్ శాఖకు లేదని ఆ విషయాన్ని తమ ఉన్నతాధికారుల ద్వారా సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని ఎస్సై వారికి చెప్పారు.

అవార్డుకు ఎంపిక



వినీషా

టేకుమట్ల: ఇటీవల జిల్లాలో నిర్వహించిన పలు నృత్య ప్రదర్శనల్లో మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన ఊరుగొండ వినీషా(6) భరత నాట్యంలో అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి గౌతమీనందీ-2024 అవార్డుకు ఎంపికైనట్లు విశ్వవిఖ్యాత ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ సంస్థ అవార్డుల ఎంపిక కమిటీ సభ్యులు ఎస్ఆర్‌వీ వెంకటేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీ గౌతమేశ్వరా గోసంరక్షణ సమితి, విశ్వవిఖ్యాత ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ సంస్థ ఆధ్వర్యంలో సంయుక్తంగా హైదరాబాద్‌లోని త్యాగరాయ గాణ సభలో నిర్వహించనున్న అవార్డుల ప్రదానోత్సవంలో నేడు (ఆదివారం) వినీషా జాతీయ స్థాయి గౌతమీనందీ అవార్డును రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అందుకోనున్నట్లు తెలిపారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వెంకటాపురం(ఎం): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరుతూ.. మండలంలోని జవహర్‌నగర్, లింగాపూర్ గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారధి కనకం రాజేందర్ బృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. వర్షాలపై తీసుకునే జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత గురించి పాటల ద్వారా కళాకారులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రాగుల శంకర్, బుచ్చన్న, ఈర్ల సాగర్, రవి, రహీమోద్దిన్, సురేష్, కిషన్, విజయ్‌కుమార్, తిరుపతి, దీపక్, భాస్కర్, రాము, శ్రీలత, సామ్రాజ్యం, శోభ పాల్గొన్నారు.

బదిలీలు చేపట్టాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మహాముత్తారం: ఎన్నో ఏళ్లుగా కుటుంబానికి దూరంగా ఉంటూ ఒకే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను వెంటనే బదిలీలు చేయాలని డొబ్బలపాడులోని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు శనివారం భోజన విరామ సమయంలో పాఠశాలలో నిరసన చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవచూపి ఉపాధ్యాయుల బదిలీల కార్యక్రమం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ రాజు, ఉపాధ్యాయులు రాము, విజయ, జ్యోతి, పావని, స్వాతి, ప్రియ, శ్రీధర్, రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.

గుండం జలపాతానికి వెళ్లొద్దు



జలపాతానికి వెళ్లకుండా ఏర్పాటు చేసిన కర్రలు

వాజేడు: మండల పరిధిలోని అరుణాచలపురం గ్రామ సరిహద్దు గుట్టల్లో ఉన్న గుండం జలపాతానికి ఎవరు వెళ్లొద్దని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి కార్తీక్ అడ్డుగా శనివారం కర్రలను కట్టారు. అరుణాచలపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ముందు నుంచి గుండం జలపాతానికి వెళ్లడానికి దారి ఉంది. అనుమతులు లేక పోయినా కొందరు అత్యుత్సాహంతో వెళ్తున్నారు. దీంతో అటుగా వెళ్లకుండా దారికి అడ్డగా కర్రలను ఏర్పాటు చేశారు.

ఏడాది దాటినా గండ్లు పూడ్చరా?



మాట్లాడుతున్న జవహర్‌లాల్

వెంకటాపురం(ఎం): మండలంలోని బుర్గుపేట పరిధిలో గల మారేడుగొండ చెరువుకు గండ్లు పడి ఏడాది దాటినా ఇప్పటి వరకు పూడ్చరా అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం బీజేపీ నాయకులతో కలిసి ఆయన మారేడుగొండ చెరువును పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. చెరువుకు పడిన గండ్లు పూడ్చివేయక పోవడంతో ఆయకట్టు రైతులు రెండు పంటలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. చెరువుకు గండ్లు పడి దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టినప్పటికీ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రోడ్డు వరద నీటికి ధ్వంసం అవుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి చెరువుకు పడిన గండ్లను పూడ్చి వేసి రైతాంగాన్ని ఆదుకోవాలని జవహర్‌లాల్ కోరారు. నాయకులు కారుపోతుల యాదగిరి, ధరంసింగ్, శ్రీధర్, సోనాసింగ్, విక్రాంత్, వినోద్ తదితరులు ఉన్నారు.

'చర్య తీసుకోవాలి'

మంగపేట: ఇసుక క్వారీల్లో ఒక్కో లారీ నుంచి రూ.2500 వసూలు చేస్తు మంత్రి సీతక్కకు ఇస్తున్నారని అసత్యపు ఆరోపణలు చేస్తున్న లారీ ఓనర్ రాజుగౌడ్‌పై చర్య తీసుకోవాలని చుంచుపల్లి నర్సింహస్వామి ఇసుక క్వారీ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు పూసం కార్తీక్, జిగట రాణి అధికారులను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. లారీ ఓనర్ రాజుగౌడ్ మరికొందరు లారీ ఓనర్లు కొందరు బీజేపీ లీడర్లతో కలిసి మంత్రి సీతక్కపై తప్పుడు ప్రచారం చేస్తు సోషల్ మీడియాల్లో పోస్టులు పెడుతున్నాడని అతడిపై చర్య తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. రాజుగౌడ్ తన పబ్బం గడుపుకోవడానికి ఒక స్థాయి గల వ్యక్తిపై ఆరోపణ చేసే ముందు పూర్తి స్థాయిలో నిజం తెలుసుకోకుండా నలుగురిని వెంట వేసుకుని అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సొసైటీ ఇసుక క్వారీ నిర్వాహకులు పోలెబోయిన రజిత, గ్రామ పెద్ద కుర్సం నర్సింగరావు, ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు పోలెబోయిన ఆదినారాయణతో పాటు తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై కమలాకర్

ములుగు రూరల్: మండలంలోని పస్రాలోని జాతీయ రహదారిపై ఎస్సై కమలాకర్ శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. సిబ్బందితో కలిసి వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం పోలీసు బలగాలకు, మావోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామని అన్నారు.

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కాటారం: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు చుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ మౌనిక సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్, ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. విద్యార్థినులు పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధులు దరి చేరవన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ముందస్తు జాగ్రత్త చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. భోజనం చేసే ముందు హ్యాండ్‌వాష్ చేసుకోవాలని దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ నిర్మల, ఏఎన్ఎం శ్యామల, ఆశ కార్యకర్త రాజేశ్వరీ పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి



కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మహాముత్తారం: భారత రాష్ట్రపతిగా ఎనలేని పేరు ప్రఖ్యాతలు గడించిన భారతరత్న అబ్దుల్‌కలాంను ప్రతీ ఒక్క విద్యార్థి స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు పాశం సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ములుగుపల్లి ఉన్నత పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంజీవరెడ్డి మాట్లాడుతూ.. దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లిన ఘనత ఆయనదే అన్నారు. మిసైల్‌మెన్‌గా పేరుప్రఖ్యాతలు పొంది శాస్త్రవేతగా రాణించి అందరికి స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, కసరం నాయక్, చంద్రకళ, యాదగిరి సుదాకర్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నాటేసి నిరసన



బురదరోడ్డుపై నాటు వేస్తున్న నాయకులు

గణపురం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు వెళ్లే దారి బురదమయం కావడంతో ఏఐఎస్ఎఫ్ నాయకులు శనివారం వరి నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోత్కు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ రోడ్డు వెంట మోడల్ పాఠశాల, కస్తూర్బా పాఠశాల, బీసీ బాలికల హాస్టల్ ఉన్నాయని, సుమారు 1,500 నుంచి 1,800 మంది విద్యార్థులు ప్రతిరోజు ఇబ్బందులు పడుతూ పాఠశాలలకు వెళ్తున్నారని అన్నారు. పాఠశాలలకు అనుకొని గోదాంకు వచ్చే లారీలతో రోడ్డు పూర్తిగా ధ్వంసమై బురదమయమైందన్నారు. కలెక్టర్ స్పందించి విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా వెంటనే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, నాయకులు ఒద్దుల సాకేత్ రెడ్డి, దాసరి నగేష్, గోశిక సంపత్, జన్ను నాని, సాయి, నిఖిల్ పాల్గొన్నారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇప్పలగడ్డ, అన్నారం, గంగారం గ్రామాల సమీపంలోని గొత్తికోయలగూడెంలో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి శనివారం తనిఖీలు నిర్వహించారు. గూడెంలలోని కుటుంబ సభ్యుల వివరాలను సేకరించడంతోపాటు కొత్త వ్యక్తులపై ఆరా తీశారు. అనంతరం మండల కేంద్రంలోని కాటాపూర్ క్రాస్ వద్ద జాతీయ రహదారిపై వచ్చిపోయే వాహనాలను ఎస్సై క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితులను విచారించి వదిలేశారు. మావోయిస్టు వారోత్సాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత చర్యల్లో భాగంగా పోలీసులు తనిఖీలు చేసినట్లు తెలిసింది.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మంగపేట: నర్సింహాసాగర్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి యమున



ఎస్ఎస్ తాడ్వాయి: గొత్తికోయలకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ మౌనిక



బోరునర్సాపురంలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి వైశాలి

మంగపేట: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చుంచుపల్లి వైద్యాధికారి చిన్నపెల్లి యమున అన్నారు. చుంచుపల్లి పీహెచ్‌సీ పరిధిలోని మల్లూరు, పాలాయిగూడెం, నర్సింహసాగర్ గ్రామాల్లో శనివారం ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. వర్షాకాలంలో వ్యాప్తిచెందే సీజనల్ వ్యాధులపై ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. 42 మంది జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీ అధికారులతో కలిసి డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించి వర్షపునీరు, నిల్వ ఉన్న మురుగు గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రాంబాయి, హెచ్‌వి పద్మ, ఏఎన్ఎం సారమ్మ, సీతమ్మ, ఆశావర్కర్లు,అనిత, యజ్ఞమ్మ పాల్గొన్నారు.

బోరునర్సాపురంలో వైద్యశిబిరం

మండలంలోని బోరునర్సాపురంలో మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వైశాలి శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారికి ర్యాపిడ్ ఫీవర్ పరీక్షలు నిర్వహించి మలేరియా పాజిటీవ్, నెగిటీవ్ నిర్ధారణ పరీక్షలు చేశారు. జలుబు, దగ్గు, వంటి నొప్పులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి వర్షాకాలంలో వ్యాపించే కీటక జనిత, శ్వాస కోశ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ ఖాదర్ అబ్బాస్, ఏఎన్ఎం, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

జలగలంచ గూడెంలో ..

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని లవ్వాల స్టేజీ సమీపంలోని జలగలంచ గొత్తికోయగూడెంలో తాడ్వాయి పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక్, సిబ్బంది శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గూడెంలోని ప్రజలకు డాక్టర్ మౌనిక వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల భారీన పడకుండా తీసుకోవాలిన్సన పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై గొత్తికోయలకు అవగాహన కల్పించారు. జ్వరాలపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు.

అనారోగ్యంతో ఇరిగేషన్‌శాఖ హెల్పర్ మృతి



మహేశ్ (ఫైల్)

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన బండి మహేశ్ (43) అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతూ హనుమకొండ ప్రైవేటు ఆస్పత్రిలో శనివారం మృతి చెందాడు. మృతుడు గతంలో రెవెన్యూశాఖలో వీఆర్ఏగా విధులు నిర్వర్తించేవాడు. గత ప్రభుత్వం వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసి పలుశాఖల్లో పోస్టింగ్‌లు ఇవ్వడంతో వీఆర్ఏ నుంచి మహదేవపూర్ డివిజన్ ఇరిగేషన్‌శాఖ కార్యాలయంలో హెల్పర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. కాగా కొన్ని రోజులుగా జ్వరం ఇతర సమస్యలతో అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమారుడు ఉన్నారు.